# సత్యవాక్కు

క్రైస్తవ మాస పత్రిక

THE WORD OF TRUTH

## ఏకైక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొందియున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 15 రకములు మావద్ద ఉన్నవి. అవిమిగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్య మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగి నప్పుడు మీ సత్యవాక్య నంబరును మాకు తెలియ జేయండి. ఇది అత్యవసరం !!

**Printed at Razan Electric Press, Kakinada-1.**

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor : Managing Editor :

J.C. CHOATE JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 12 ఫిబ్రవరి 1992 సంచిక 7


## సంపాదకీయము

### ఆపొస్తలులు - బలహీనతలు మరియు బలము

(The Apostles - Weaknesses and Strengths)

కొన్ని సమయములలో మనలో మనమే విచారం కలిగి యుంటాము. దేవుని యెడల విధేయత కలిగి యుండనందుకు అనేక రకాల క్షమాపణలు చెపుతూ వుంటాము. మనము బలహీనులమని, ఘోర పాపులమని దేవుడు ఎన్నడు మనలను క్షమించడని తలస్తూ వుంటాము. మనలను మనమే మభ్య పెట్టుకుంటాము. అయితే ప్రభువు చనిపోయినది ఎందుకు? పాపులను రక్షించుటకే గాని నీతిమంతులను రక్షించుటకు నేను రాలేదని ఆయన చెప్పియున్నాడు. "రోగులకేగాని ఆరోగ్యముగలవారికి వైద్యునితో అక్కరలేదు; నేను పాపులనే పిలువ వచ్చితిని గాని నీతిమంతులను పిలువ రాలేదు" (మార్కు 2 : 17).

యేసుక్రీస్తు పాపరహితుడని, పరిశుద్ధుడు, పరిపూర్ణుడని మన కందరకు తెలుసు. పౌలు క్రీస్తును గూర్చి యిట్లనెను : "ఎందుకనగా

మన మాయనయందు దేవుని నీతి యగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను" (II కొరింధి 5 : 21). హెబ్రీయుల పత్రిక రచయిత యిట్లనెను: "మన ప్రధాన యాజకుడు మన బల హీనతల యందు మనతో సహానుభవము లేనివాడు కాడు గాని, సమస్త విషయములలోను మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేని వాడుగా ఉండెను. గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయముకొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము" (హెబ్రీ 4:15, 16). "ఆయన పాపము చేయలేదు; ఆయన నోటను ఏ కపటమును కనపడలేదు" (1 పేతురు 2 : 22) అని పేతురు చెప్పెను. యేసుక్రీస్తు తదనంతరము ఎవరని ఆలోచిస్తే క్రీస్తు అపొస్తలులని చెప్పవచ్చు. వారు పాపము లేనివారా? అలా అని కాదు.

మత్తయి సువార్త 10వ అధ్యాయము ప్రకారము క్రీస్తు తన పనిని సాగించుటకు పండ్రెండు మంది శిష్యులను లేక అపొస్తలులను ఏర్పరచుకొని వారికి బోధించి, శిక్షణ యిచ్చినట్లుగా కనబడుచున్నది. వీరు మానవులని, తప్పులు చేస్తారని ఆయనకు తెలుసు. అందుకే ఆయన వారిని సర్వ సత్యములోనికి నడిపించుటకు తను వాగ్దానము చేసిన ఆదరణకర్త యగు పరిశుద్ధాత్మను వారికి పంపించెను (యోహాను 14 : 26; 16 : 13). ఈ ఆదరణకర్తను పొందకముందు శిష్యులలో కొంత మంది పరిస్థితిని సమీక్షించుదము.

మొదటిగా ఇస్కరియోతు యూదాను చూదము. ఇతడు క్రీస్తు పండ్రెండు మంది శిష్యులలో నొకడు (మత్తయి 26 : 47). ఇతడు డబ్బుసంచి తనయొద్ద పెట్టుకొని అందుండి డబ్బు దొంగిలించువాడుగా కనబడుచున్నాడు (యోహాను 12 : 6; 13 : 29). దీని వలన ఇతడు ధనాపేక్ష కలవాడుగ, డబ్బుకోసం ఎటువంటి నీచకార్యమైనా చేయ

గలవానిగా కనబడుచున్నాడు. అటు పిమ్మట అతడు ఆఖరి ప్రభు రాత్రి భోజనములో పాలుపంచుకొనినట్లు (మత్తయి 26); ముప్పది వెండి నాణెములకు క్రీస్తును అప్పగించినట్లు, అటు తర్వాత అతడు పశ్చాత్తాపపడి బయటికి పోయి ఉరి పోసుకొని చనిపోయినట్లుగా లేఖనములు రుజువు చేయుచున్నవి (మత్తయి 26 : 47-56; మత్తయి 27 : 3-10).

రెండవవాడు, ప్రభువును ముమ్మారు ఎరుగనని బొంకిన పేతురు. ఇతడు ప్రభువును ఎన్నడు విడిచిపెట్టనని అవసరమయితే ఆయన కొరకు తన ప్రాణమునయినా యిస్తానని చెప్పినప్పటికీ క్రీస్తు పేతురుతో నీవు నేను అప్పగింపబడిన రాత్రి తొలికోడి కూయక ముందు ముమ్మారు నన్నెరుగనని బొంకుదువని చెప్పెను (యోహాను 13 : 36-38). ఆ విధముగనే జరిగెను. అట్లు జరిగిన తరువాత "కోడి కూయకమునుపు నీవు నన్నెరుగనని ముమ్మారు చెప్పెదవని యేసు తనతో అనిన మాట పేతురు జ్ఞాపకము తెచ్చుకొని వెలుపలికి పోయి సంతాపపడి యేడ్చెను" (మత్తయి 26 : 69-75). ప్రభుని ఎరుగనని చెప్పినందుకు, తను చేసిన పాపానికి అవిశ్వాసానికి పశ్చాత్తాప పడిన తరువాత అతడు క్రీస్తు సంఘమునకు గొప్ప బోధకుడుగా తయారాయెను. ఈ పేతురే మిగతా అపొస్తలులతో కలిసి పెంతెకోస్తు దినమున మొట్టమొదటి సువార్త ప్రసంగము చేసెను (అ. కార్య. 2). తర్వాత అ. కార్య. 10, 11 అధ్యాయములలో పేతురు అన్యులమధ్య సువార్త ప్రకటించుట కనుగొనగలము. ఇతడు వ్రాసిన రెండు పత్రికలు క్రొత్త నిబంధనలో చేర్చబడినవి. ఇందు మూలముగా మనకు తెలిసిన దేమనగా పేతురు తప్పులు చేసాడు. అయితే పశ్చాత్తాపపడి వాటిని సరిచేసుకొని దేవుని సువార్త సేవను బహు బలంగా కొనసాగించాడు.

మూడవ వాడు తోమా. ఇతడు ప్రభువు పునరుత్థానాన్నే అనుమానించాడు. క్రీస్తు పునరుత్థానుడైన తరువాత జరిగిన విషయాన్ని కొంత లేఖన భాగములో చూతము: "ఎనిమిది దినములైన తరువాత ఆయన శిష్యులు మరల లోపల ఉన్నప్పుడు తోమా వారితో కూడా వుండెను. తలుపులు మూయబడి యుండగా యేసు వచ్చి మధ్యను నిలిచి—మీకు సమాధానము కలుగునుగాక అనెను. తరువాత తోమాను చూచి—నీ వ్రేలు ఇటు చాచి నా చేతులు చూడుము; నీ చెయ్యి చాచి నా ప్రక్కలో ఉంచి, అవిశ్వాసివి కాక విశ్వాసివై యుండుమనెను. అందుకు తోమా ఆయనతో — నా ప్రభువా, నా దేవా అనెను. యేసు—నీవు నన్ను చూచి నమ్మితివి, చూడక నమ్మిన వారు ధన్యులని అతనితో చెప్పెను" (యోహాను 20:26-29). ఈ విధముగా ఎందుకు జరిగిన దనగా అంతకు ముందు తోమా—"నేను ఆయన చేతులలో మేకుల గురుతును చూచి నా వ్రేలు ఆ మేకుల గురుతులలో పెట్టి, నా చెయ్యి ఆయన ప్రక్కలో ఉంచితేనే గాని నమ్మనే నమ్మనని వారితో చెప్పెను" (యోహాను 20:24, 25). గనుక క్రీస్తు అతని అనుమానాన్ని తీర్చుకొనుటకు అవకాశాన్ని కలుగ జేసెను. దీనిని బట్టి యితడు "సందేహించు తోమా"గా చిత్రించబడ్డాడు. కాని, తదుపరి అంతకంటే బలంగా సువార్తను ప్రకటించినట్లు చరిత్ర చెబుతున్నది. ఇతడు భారత దేశము వచ్చి అనేక ఆత్మలను రక్షించి, పశ్చిమ భారత సంఘములను ఏర్పరచినట్లు; ఆ తర్వాత తూర్పు తీరాన పర్యటించి మద్రాసు పట్టణ సమీపాన ఈటెతో పొడవబడి మరణించినట్లు దాఖలాలు గలవు.

[illegible]

[illegible] తెలుస్తుంది ఇతడు మార్పు చెందక ముందు ప్రభువు ఆయన సంఘమునకు శత్రువై [illegible] క్రైస్తవులను హింసించేవాడు. ఇతడు మార్పు చెందిన తర్వాత పునరుత్థానుడైన

క్రీస్తును గూర్చి, ఆయన రక్షణనుగూర్చి బోధించుట మొదలుపెట్టెను (అ.కా. 9). ఇతడు మూడు గొప్ప సువార్త ప్రయాణములు చేసి, అనేక పత్రికలను వ్రాసెను. అవన్నియు క్రొత్త నిబంధనయందు చేర్చబడి యున్నవి. అతడు ప్రభుని సంఘమును హింసించినందుకు తన జీవితకాలమంతయు పశ్చాత్తాపముతో బాధపడుచునేయున్నాడు. అందుకే అతడు తనను గూర్చి "ప్రధాన పాపి" యని చెప్పుకొనెను (1 తిమోతి 1:15). నేను చేస్తున్న ఈ సేవను గూర్చి, ప్రభువు తన కృపవాత్సల్యాన్ని బట్టి ఆయన నన్ను క్షమించినట్లయితే; పశ్చాత్తాపపడిన వారినందరిని ఆయన క్షమించగలడని పౌలు తలంచెను. అటు పిమ్మట అతడు క్రీస్తుకొరకు ఆత్మ త్యాగము చేసెను.

ఈ విధముగనే మిగతా అపొస్తలుల యందును బలహీనతలు మరియు బలమును తరువాత వారు ప్రదర్శించిన విశ్వాసము భక్తి చూడగలము. దేశ బహిష్కరణ చేయబడి పత్మాసుదీవికి పంపబడిన యోహాను తప్ప మిగతా అందరు క్రీస్తు నిమిత్తము శత్రువుల చేతికి అప్పగింపబడి చనిపోవుటకు సిద్ధపడిరి.

ఇదంతయు చూడగా శిష్యుల్లు ప్రథమములో పాపము చేసిన వారైనా క్రీస్తును వెంబడించునపుడు కూడా వారు పాపము చేయుచునే యుండిరి. తరువాత పశ్చాత్తాపపడి క్షమింపబడి గొప్ప సువార్త సేవకులుగా నిలువబడి హతసాక్షులైరి. కావున ప్రభువు మీ పాపములను కూడ క్షమించగలడు. యేసు క్రీస్తును సిలువ వేయునప్పుడు అనేకమంది చూచిరి; సిలువ వేయబడుటకు కారకులు కూడ అందులో వున్నారు. వారిలో కొంతమంది యెరూషలేములో మొదటసారిగా సువార్త ప్రకటింపబడు చోటికి వచ్చిరి. వారిలో విధేయత చూపి రక్షింపబడిన వారిని ప్రభువు సంఘముతో చేర్చెను.

క్రైస్తవులనుగూర్చి యోహాను ఇట్లు చెప్పెను. "అయితే ఆయన వెలుగులో నున్న ప్రకారము మనమును వెలుగులో నడచిన యెడల, మనము అన్యోన్య సహవాసముగల వారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును. మనము పాపము లేని వారమని చెప్పుకొనిన యెడల, మనలను మనమే మోసపుచ్చు కొందుము; మరియు మనలో సత్యముండదు. మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును. మనము పాపము చేయలేదని చెప్పుకొనిన యెడల, ఆయనను అబద్ధికునిగా చేయువారమగుదుము; మరియు ఆయన వాక్యము మనలో ఉండదు." (1 యోహాను 1:7-10).

జీవితములో తన పాపముల విషయమై మారుమనస్సు పొందని లేక దేవునిచే క్షమింపబడని వ్యక్తి తన పాపములలోనే యుండి చనిపోవును. అయితే తనలో ప్రాణము వున్నంతవరకు అనగా జీవించి యున్నంతవరకు తన పాపములను గూర్చి మారుమనస్సు పొంది దేవునికి విధేయుడై యుండుటకు అవకాశము కలదు (అ.కా. 2:38). అయితే ఒకటి గమనింపుము. ఆలశ్యము చేసే నీ ఆత్మకు ఆపద తెచ్చి పెట్టకు. పరిశుద్ధ గ్రంథము ఈ విధముగా చెప్పుచున్నది. "ఇదిగో యిప్పుడే మిక్కిలి అనుకూల సమయము, ఇదిగో ఇదే రక్షణ దినము" (2 కొరింథీ 6:2).

— o —

## విశ్వాస మొక్కటే

(There is One Faith)

"విశ్వాసమొక్కటే, ....." (ఎఫెసి 4:5). ఈ లోకము మతావలోకనమును గూర్చిన యోచనలతో బహుగా తబ్బిబ్బగు

చున్నది. ఈ సత్యమును తెలుసుకొనుటకు ఒకడు మేధావి కానక్కర లేదు. ఒకని కిష్టమైన మతపద్ధతులను అవలంబించు హక్కు అందరికి అందుబాటులో యుండవలెనని కొందరి తలంపు. ఇందు నిమిత్తము వారు వాదింతురు, పోరాడుదురు. విశ్వాసమొక్కటే అను మాటతో విభేదింతురు.

అయినను మనుష్యులను ఆనందపరచుట కాదుగాని దేవుని ఆనందపరచుట ముఖ్యము. దేవుని ఎన్నిక సక్రమముగానే యున్నదని మనము గ్రహించవలెను. ఆసక్తితో దేవుడు మనలను ఎన్నుకొనెను. అయితే ప్రస్తుతము మనముందున్న లేఖనము విశ్వాసమును గూర్చి బోధించుచున్నది. విశ్వాసమొక్కటే అను ఏకవచనభావమందు గలదు. "విశ్వాసము", విశ్వాసమొక్కటే అను పదములు క్రైస్తవ్యమంతటికి అవగతమే. ఈ సంగతే సంఘమునకు వ్రాయుచు యూదా యిట్లు చెప్పుచున్నాడు:

"ప్రియులారా, మనకందరికి కలిగెడు రక్షణను గూర్చి మీకు వ్రాయవలెనని విశేషాసక్తిగలవాడనై ప్రియత్నపడుచుండగా, పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధ నిమిత్తము మీరు పోరాడవలెనని మిమ్మును వేడుకొనుచు మీకు వ్రాయవలసి వచ్చెను" (యూదా 3 వచ).

కొందరు విశ్వాసమొక్కటే అను మాటతో విభేదింతురను సంగతినిగూర్చి జాగ్రత్తగా పరిశీలించుము. అనేక విశ్వాసములుండ వచ్చునని వాదించుట, ప్రోత్సహించుట మేలుకాదు. అట్టి విరుద్ధ ప్రవర్తన కలవరమునకు, విభిన్నతకు, అసంబద్ధతకు తావీయును. ఒకటే మరియొక దానివలె మంచిదని అనేకమంది చెప్పుటచేత నేడు వారును ఖచ్చితముగ నక్లే చేయుచున్నారు. "విశ్వాస సంబంధమైన

మంచి పోరాటము పోరాడమని" పౌలు అర్థించుచున్నాడు (1 తిమో 6:12). మంచి కొరకు పోరాడమనుటలేదు. అట్లే అనేక విశ్వాసముల కొరకు పోరుడుమనుట లేదు. "విశ్వాసమును కాపాడుకొంటినని" పౌలు చెప్పుచున్నాడు (2 తిమో 4:7). సమర్పణ, భక్తి, పట్టుదలతో అన్యులకు అపొస్తలుడైనను పౌలు పాత నిబంధనను త్యజించి సంపూర్తిగా క్రొత్త నిబంధనను హత్తుకొని ఆ విశ్వాసమునకే విధేయత చూపి తుదకు దానికొరకే ఆత్మ త్యాగము చేసెను (2 తిమో 4:7-8).

ఒకే విశ్వాసము ఒకే విమోచనా ప్రణాళిక యుండవలెనని దేవుడు తలంచినాడనుట నిర్వివాదాంశము. ఇది మానవ రూపకల్పన గాని మానవసృష్టిగాని కాదు. మానవ హృదయముల నుండి, వారి సమాలోచనలనుండి జనించిన అంశము కాదిది. ఒకే విశ్వాసమనునది మానవుల మేలు కొరకు దేవుని మహిమ నిమిత్తము ఆయన హృదయములో జనించిన అంశమై యున్నది.

బైబిలు స్వీయ వాఖ్యానమై యున్నది. "ఆత్మయు ఒక్కడే" అనే పౌలు మాటలు గమనించండి. ఇది సత్యమై యున్నది. అదే లేఖన భాగములో గల "విశ్వాస మొక్కటే" అనునది కూడ సత్యమైన అంశమై యున్నది. ఆత్మ ఒక్కటే అని గ్రహించినట్లే విశ్వాసము మొక్కటే అని కూడ మనము గమనించవలెను.

యేసు తన మరణమునకు స్వల్ప వ్యవధి ముందుగా నిరుత్సాహము సందిగ్ధావస్థలో యున్న తన శిష్యులను కలుసుకొని "మీరు దేవునియందు విశ్వాసముంచుచున్నారు. నా యందును విశ్వాసముంచుడి. నేనే మార్గమును సత్యమును జీవమునై యున్నాను, నా ద్వారానే తప్ప ఎవడును తండ్రి యొద్దకు రాడు" అని చెప్పెను (యోహా 14:1, 6).

నిజముగా క్రీస్తే మార్గము సత్యము జీవమైనచో ఒకటి కంటె ఎక్కువ విశ్వాసములు ప్రభువు దృష్టిలో ఏల అంగీకరింపబడును? అనేక విశ్వాసము లుండుటవలన లోకము అనేకసార్లు అపనమ్మకము సందిగ్ధతలలో కొట్టుమిట్టాడు చున్నది. విభజనలవలన కుటుంబములు విడిపోవుట, సమాజములో అంతర్యుద్ధములు మరియు దేశమునకు దేశమునకు వైరములు సంభవించును. సరళతరమగు దేవుని వాక్య బోధను మానవుడు తిరస్కరించుట వలన లోక మంతటికి ఆత్మీయ ముగా హానికలుగును.

శరీర మొక్కటే, నిరీక్షణ ఒక్కటే, ఆత్మయు ఒక్కడే, ప్రభువు ఒక్కడే, బాప్తిస్మ మొక్కటే, దేవుడొక్కడే అని వ్రాయ బడిన విధముగనే విశ్వాసము కూడ ఒక్కటే అని గ్రహించుకొనుము.

—చార్లెస్ ఇ. కాబ్.

---

## "మనలను ధనవంతులను చేయుటకు ఆయన దరిద్రుడాయెను"

(2 కొరింథి 8 : 9)

ఇది ఒక విచిత్రమైన సత్యము. రెండు విరుద్ధ భావములు కలి గిన ఒక వాక్యము. దీనిని ఆంగ్ల భాషలో పేరడాక్స్ (peradox) అని అంటారు. ఒక దరిద్రుడు ఎప్పుడైనా మరొక పేదవాని ధనవం తునిగా చేసి యున్నాడా? చేయగలడా? కాని క్రీస్తు దేవుని కుమారు డై నందున, ఆయన ఏ స్థాయిలో వున్నను దరిద్రులమైన మనలను ధనవంతులనుగా చేయగలడు. ఎందుకనగా ఆయనకు పరలోకమం దును, భూమి మీదను సర్వాధికారి మియ్యబడి యున్నది (మత్తయి 28 : 18). తండ్రియు, ఆయనయు ఏకమైయున్నారు (యోహాను

17 : 11). లోకము పుట్టకమునుపే క్రీస్తు వున్నాడు. అబ్రాహాము పుట్టకమునుపే నేను వున్నానని యేసు చెప్పాడు (యోహాను 8:58). సర్వము ఆయనయందు సృజింపబడెను. సర్వము ఆయన ద్వారాను, ఆయనబట్టియు సృజింపబడెను. ఆయన అన్నిటికంటెను ముందుగా వున్నవాడు. ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు (కొలస్సి 1:16) సమస్తమును ఆయన మూలముగా కలిగెను. కలిగియున్న దేదియు ఆయన లేకుండ కలుగలేదు (యోహాను 1 : 3). అయినను ఆయన మనకొరకు దరిద్రుడాయెను (లూకా 2 : 12). మనకొరకు దాసుడాయెను (ఫిలిప్పీ 2:7). ఆయనకు తల వాల్చుటకు స్థలము లేదు (లూకా 8 : 20) సమాధి లేదు (మత్తయి 27 : 60). "ఇది మనుష్యులకు అసాధ్యమే గాని దేవునికి సమస్తమును సాధ్యము" అని యేసు చెప్పెను (మత్తయి 19 : 27).

## పితరుల యుగంలో

ఆదాము ఏదెను తోటలో నుండి శపింపబడి వట్టి చేతులతో ముండ్లపొదలకు, తుప్పలకు, గచ్చ పొదలకు వెళ్ళగొట్టబడినపుడు, మూడవ కుమారుడైన షేతు ద్వారా దేవుడు ఆశీర్వదించి నీతిమంతుడైన నోవహును పుట్టించెను. జలప్రళయము తరువాత దేవుడు నోవహును తన ముగ్గురు కుమారులను బహుగా ఆశీర్వదించెను (ఆది కా. 9:1-3). అబ్రహాము ఊరు పట్టణమునుండి సమస్తమును విడిచి దేవుడు చూపించు దేశానికి వెళ్ళమన్నప్పుడు, "అనగా ఎక్కడికి వెళ్ళవలెనో ఎరుగక వెళ్ళెను" (హెబ్రీ 11:8). అయినను అబ్రహాము వెండి, బంగారము, పశువులు కలిగి బహు ధనవంతుడై యుండెను (ఆది కా. 13 : 3). యాకోబు రిక్త హస్తములతో తన తండ్రి ఇస్సాకునుండి, పద్దనరాములోని తన మామ లాబాను ఇంటికి పారిపోయెను. అయితే దేవుడు అతనిని విస్తారముగా మేకలతోను,

గొర్రెలతోను ఆశీర్వదించెను. యోసేపు నిలువటంగీ కూడ తీసివేయ బడినవాడై బానిసగా ఐగుప్తు దేశములో అమ్మబడెను. కాని దేవుడు అతనిని ఐగుప్తు దేశమున కంతటికి అధిపతిగా నియమించెను: మోషే పెద్దవాడై నప్పుడు విశ్వాసమునుబట్టి ఐగుప్తు ధనముకంటె, క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని యెంచుకొని, అల్పకాలము భోగము అనుభవించుటకంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించి ఫరో కుమార్తె యొక్క కుమారుడని అనిపించు కొనుటకు ఒప్పుకొనలేదు. కాని ఇశ్రాయేలీయుల జనాంగమునకు ప్రథమ నాయకుడై ప్రపంచానికి ఒక అత్యున్నతమైన న్యాయ శాస్త్రమును అందించెను. యోబు తన ఆస్తినే గాకుండ తన భార్య తప్ప కుటుంబ సభ్యులందరిని పోగొట్టుకొనెను. కాని దేవుడతనికి ఏడంతల ఆస్తిని సమకూర్చి తన కుటుంబాన్ని మరల బ్రతికించెను. దావీదు కేవలం గొర్రెల కాపరి. కాని దేవుడు తన ఆత్మ పరివర్తనవాడైన దావీదును ఇశ్రాయేలీయులకు పరాక్రమ రాజుగా చేసి, తన ఆలయమును యెరూషలేములో కట్టుటకు తన కుమారుడైన సొలొమోనుకు ధనమును చేకూర్చెను.

## క్రీస్తు యుగంలో

క్రీస్తు యుగములో దేవుని వాక్యమును, అపొస్తలులద్వారాను, మరెక్కువగా పౌలుద్వారా యూరపు దేశములకు వ్యాపింప జేసెను. అందుకనే పౌలు కొలస్సి 2 : 3లో బుద్ధి జ్ఞానముల సర్వ సంపదలు ఆయన యందే గుప్తములై యున్నవి అని సెలవిచ్చుచున్నాడు. రోమా సంఘమునుండి మూడు, నాల్గు శతాబ్దములలో ఇంగ్లాండు దేశమునకు క్రైస్తవ్యము వ్యాపించినది. ఎథెల్ బర్ట్ అను రాజు రోమ్ నగర రాకుమార్తెను వివాహమాడెను. ఆమె తనతో కూడ ఒక బోధకుని ఇంగ్లాండుకు తీసుకొని వెళ్ళింది. రాజు క్రైస్తవుడు

కాగానే ప్రజలందరు క్రైస్తవ్యమును స్వీకరించిరి. ఇంగ్లాండు నుండి దైవ వాక్యము యూరపులోని ఇతర దేశాలకే కాక, ప్రపంచ మంతటికి పాకెను. దేవుని వాక్యముద్వారా మంచి ప్రభుత్వములు (civil services) స్థాపింపబడినవి. ప్రపంచ మంతట ఒక విధమైన ప్రశాంతి, సమాధానము, నాగరికత, విజ్ఞానము ఏర్పడినది. పరిశ్రమలు, వ్యాపారము, సాంకేతిక విజ్ఞానము మొదలగునవి అభివృద్ధి చెంది, క్రైస్తవ దేశాలన్నీ ధనవంత దేశాలుగా మారినవి. రాణి విక్టోరియా ఇంగ్లాండు దేశాన్ని పాలించిన రోజులలో ఆఫ్రికానుండి ఒక ప్రముఖ వ్యక్తి ఆమెను కలసికొని, "అమ్మా మీది చాల చిన్న దేశము. కాని ఇంత పెద్ద ప్రపంచాన్ని ఏలా ఏలగలుగుతున్నారు" అని ప్రశ్నించగా, ఆమె తన బల్లమీదనున్న పరిశుద్ధ గ్రంథాన్ని చూపించి, "ఇదిగో ఈ శక్తిచేతనే పరిపాలించగలుగు చున్నామ"ని సాక్ష్య మిచ్చినది. "బుద్ధి జ్ఞానముల సర్వసంపదలు ఆయన యందే గుప్తములై యున్నవి" కొలస్సి 2 : 3.

దేవుడు విశ్వమును తన మాటచేత సృజించాడు. అందులో మానవుని తన పోలికగా సృజించి వానికి కావలసిన బుద్ధి, జ్ఞానములు, సర్వసంపదలు నిచ్చి, వెండి, బంగారముల కంటె విలువైన తన వాక్యమును మనకు ప్రసాదించాడు. ఇహలోక ధనముకంటెను పరలోక ధనమును కూడ యిచ్చాడు. "పరలోకమందు మీ కొరకు ధనము కూర్చుకొనుడి" అని ప్రభువు చెప్పుచున్నాడు (మత్తయి 6 : 20). ఈ లోకములోనున్న ధనమును వెచ్చించి మన ఆకలిని, దప్పిని, రోగమును, దుఃఖమును తీసివేయుటకు ప్రయత్నిస్తాము. కాని అక్షయ శాశ్వతమైన ఆత్మీయ ధనమున్నది (ప్రకటన 7 : 15-17; 21 : 3-4). ఆయన అదృశ్య దేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆదిసంభూతుడై యున్నాడు. ఏలయనగా ఆకాశమందున్నవియు భూమియందున్నవియు

దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను, ప్రభుత్వములైనను, ప్రధానులైనను, అధికారములైనను, సర్వమును ఆయన యందు సృజింపబడెను. ఆయన అన్నిటికంటె ముందుగా వున్నవాడు; ఆయనే సమస్తమునకు అధారభూతుడు (కొలస్సి 1 : 15, 16). "పైనున్న మీాదవాటినే గాని, భూసంబంధమైన వాటిమీాద మనస్సు పెట్టుకొనకుడి. ఏలయనగా మీారు మృతి పొందితిరి. మీా జీవము క్రీస్తుతో కూడ దేవునియందు దాచబడి యున్నది. మనకు జీవమైయున్న క్రీస్తు ప్రత్యక్షమైనపుడు, మీారును ఆయన యందు ప్రత్యక్ష పరచబడుదురు" (కొలస్సి 3 : 2-4).

—A. జ్ఞాన ప్రకాశం, కృష్ణసముద్రం, చిత్తూరు.

---

## సహవాసము

"మొదట మీా సహవాసము వలన కొంత మట్టుకు తృప్తి పొంది.." (రోమా 15 : 23-24). తృప్తికరమైన సహవాసము క్రీస్తు సంఘములో ఉన్నది. "మోసపోకుడి దుష్ట సాంగత్యము మంచి నడవడిని చెరుపును" (1 కొరి 15 : 33). క్రీస్తు సంఘము అపొస్తలుల బోధతో క్రీస్తునందలి తమ సహవాసమును ప్రారంభించెను అ.కా. 2 : 42). నమ్మతగిన దేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తు సహవాసమునకు పిలచెను (1 కొరి 1 : 9). పరిశుద్ధాత్మ సహవాసము సంఘమునకు తోడై యుండెను (2 కొరి 13 : 14).

అపొస్తలులు—"మాతో కూడా మీాకు సహవాసము కలుగునట్లు మేము చూచినదానిని వినిన దానిని మీాకు తెలియజేయుచున్నాము. మన సహవాసమైతే తండ్రితో కూడను ఆయన కుమారుడైన యేసుక్రీస్తుతో కూడను ఉన్నది" (1 యోహా 1 : 3).

క్రీస్తు సంఘము అపొస్తలుల బోధయందుండి సభ్యులు వ్యక్తిగతంగా సహవాసము కలిగియున్నారు. అనగాఅపొస్తలులు, సువార్తికులు, ఉపదేశకులు, కాపరులు ఏకముగా తండ్రియైన దేవునితోను, కుమారుడైన యేసుక్రీస్తుతోను, ఆదరణకర్తయైన పరిశుద్ధాత్మునితోను డిండొరులతోను సహవాసము కలిగి యున్నారు. ఈ పవిత్ర సహవాసములో గల ఏకత్వము విడదీయరానిది.

క్రీస్తు సంఘ కూడికలవలన క్రైస్తవ సహవాసము పెంపొందగలదు. సంఘమందుగల ప్రతీ సహోదరి, సహోదరుడు ఈ కూడిక వలన తృప్తి పొంది పరిపూర్ణ సంతోషముతో అన్యోన్య సహవాసమును అనుభవించగలరు. దేవునియందు గల తమ సహవాసములో ఎడతెగక యుండునట్లు తరచు క్రైస్తవ సహవాస కూడికలు స్థానిక క్రీస్తు సంఘములు జరిగించుచుండుట మిక్కిలి అవసరమే. అయితే క్రీస్తుసంఘపు పరిధిలోనుండి బోధకులను వేరుచేసి బోధకుల సహవాస కూటములు జరిగించుటను గూర్చి అపొస్తలులు బోధించినట్లు లేఖనములు సాక్ష్యమిచ్చుటలేదు.

క్రీస్తు సంఘము ఏకత్వముతో కూడిన సహవాసములో ఎదుగుట ఆశీర్వాదము. క్రీస్తు సంఘముయొక్క సంతోషము పరిపూర్ణమగుటకే ఈ సంగతులు వ్రాయబడెను. వ్రాయబడిన సత్యవాక్యాన్ని సరిగా విభజించినపుడే సంపూర్ణమై యున్న దేవుని చిత్తము ఏదో తెలియబడును.

సంపూర్ణమై యున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనుచూ తండ్రియైన దేవుని సహవాసములో ఎదుగుదము.

—పాల్ గూటం, గొల్లవిల్లి.

—o—

# క్రైస్తవ్యంవల్ల ప్రయోజనం ఏమి?

"నేను మరి విశేషముగా ప్రయాసపడితిని, నేను మరియెక్కువగా క్రీస్తు పరిచారకుడను" II కొరి 11 : 23.

మత శాఖలు అధికముగ నున్నందున యీనాడు మనుష్యులు తమకు తోచిన మతశాఖవల్ల ఆకర్షింపబడుచున్నారు. మతశాఖలతో బేరములాడుచున్నారు. యేది మనకు లాభదాయకముగ నున్నది అని ప్రశ్నించుకొనుచున్నారు.

కొన్ని మతశాఖలవారు వారి సంఘములను గూర్చి బహుగా అతిశయించుచున్నారు. శరీర సంబంధమైన ఆకర్షణలు, సంగీతములు ఉద్రేకపూరితమగు వాతావరణము కొందరు కోరుకొనుచున్నారు. మరికొందరు అయితే యెక్కడ మనశ్శాంతి లభించునో అక్కడ ఆరాధించుచున్నారు. మతనాయకులు సంఘ ఆరాధనలు ఆకర్షణీయముగ నుండునట్లు వాయిద్య సంగీతములను వాడుచున్నారు.

మరి కొందరు గొప్ప గొప్ప ఉద్యోగములు చేయు స్నేహితులను కలుసుకొన ఆశింతురు. ఆత్మీయ శక్తిగల ఆరాధన స్థలములను కొందరు కోరుకొందురు. పౌలు కొరింథీ సంఘములో యిట్టి ప్రమాదములకు గురియగు వారిని గమనించుచున్నాడు. మనము శరీర సంబంధమగు ఆకర్షణలకు లోనైతిమా—ఆత్మతోను సత్యముతోను ఆరాధింపలేము. యోహాను 4 : 24.

మతము కొందరు బుద్ధిహీనులకు ఆటపాటగా యున్నది. II కొరి 11 : 16-22. ఆ దినములలో అపొస్తలు' లందరిలో అధికులమని అతిశయించువారు కలరు. 11 : 5. కంటికి కనబడవలెనని డాంబికముగ ప్రవర్తించువారు కలరు, పౌలు అట్టి వారిని విమర్శించుచున్నాడు. 10-13 అధ్యాయములలో అపొస్తలులయొక్క ఆడంబరత,

అతిశయములను గూర్చి అధికముగా చర్చించబడినది. వారి జీవితములలో పరిశుద్ధాత్మ శక్తి కనిపించదు కాని ఆడంబరతతో కూడిన డాంబిక మాటలు మాత్రము వినిపిస్తూ ఉంటాయి. యీ డంబపు వాక్కులనుగూర్చి 10-15 అధ్యాయములలో 19 సార్లు ఉచ్చరించబడియున్నది. ఈ డాంబిక బోధకులను బట్టి పౌలు కూడా అతిశయింపవలసి వచ్చెను. ఈ డాంబికులగు అపొస్తలులు వారికి కలిగిన దర్శనములను గూర్చియు, ప్రత్యక్షతలను గూర్చియు అతిశయపడుచున్నారు. 12 : 1. పలుమార్లు హింసింపబడి, హీనపర్చబడిన బలహీనుడును, కురూపియు నగు పౌలును బహు హీనముగా చూచుచున్నారు. తరచుగా కారాగారములలో బంధింపబడినవాడును, పలు పట్టణములలో హింసింపబడినవాడునైన పౌలును గూర్చి బహు హీనమైన అభిప్రాయము వీరు కలిగియున్నారు. పౌలు యెక్కడికి వెళ్ళినను అక్కడ అల్లకల్లోలములు అలజడి చెలరేగియున్నవి. 2 : 16. తన శత్రువులయొక్క విమర్శలను పౌలు చులకనగా త్రోసివేయలేదు. పౌలు క్రీస్తు పక్షముగా పొందిన హింసలకు తన శరీరముపై ముద్రలు ధరించియున్నాడు. II కొరి 6 : 4లో పౌలు పొందిన శ్రమానుభవములను గూర్చి వ్రాయుచున్నాడు. 11 : 16-18. క్రీస్తు శ్రమానుభవములలో పాలు పొందుట యెట్టిదో పౌలు వివరించుచున్నాడు. 11 : 22-33. పౌలు యీ విధమైన బుద్ధిహీనమై సంభాషణలలో సాధారణముగ చర్చకు సిద్ధపడినవాడు కాడు. యిట్టి సంభాషణ బుద్ధిహీనతయని పౌలు వ్రాయుచున్నాడు. 11 : 1. క్రీస్తు మాట్లాడినట్లు నేను మాట్లాడుట లేదు కాని బుద్ధిహీనముగ మాట్లాడుచున్నందుకు సహించవలెనని పౌలు వ్రాయుచున్నాడు 11 : 17. అతిశయపడువారు బుద్ధిహీనులు మాత్రమే—పౌలునకు అతిశయించుట దూరమగుగాక! తన విమర్శలకులే పౌలును రెచ్చగొట్టియున్నారు. కొరింథీ క్రైస్తవులు బుద్ధిహీనులగు అపొస్తలుల మాటలు యింతవరకు విని

యున్నారు. గత కాలములో కొరింథీయులు డంబపు మాటలు పలుకు వారిని సహించిరి. వారి మాటలతో కొరింథీయులను లోపర్చుకొనిరి. నిజమైన క్రీస్తు సేవకులెవరో వారు గుర్తింపగలిగి యుండిన యెడల,వారు తమ అభిప్రాయముల యెడల గందరగోళపడి యుండేవారుకారు. కొరింథీ సంఘము డాంబికముగ మాట్లాడు వారిని బహుగ సహించినది. పౌలు యెక్కడికి వెళ్ళినను, తనను గూర్చి బలహీనుడనియు, దెబ్బలు తిన్న వాడనియు, ద్వేషింపబడినవాడనియు అభిప్రాయము ప్రజలలో యుండినవి. పౌలు తన్ను విమర్శించువారిని విడిచిపెట్టలేదు. II కొరి 6:4లో పౌలు తాను అనుభవించిన నిందలు, ఆపదలను గూర్చి వ్రాయుచున్నాడు. 6 : 10. క్రీస్తు నిమిత్తము తాను పొందిన శ్రమలను గూర్చి వ్రాయుచున్నాడు. ఆయన సేవలో పొందిన శ్రమానుభవపు గురుతులను 11 : 23-33లో వ్రాయుచున్నాడు. II కొరింథీ పత్రికలో తప్ప మరి యెక్కడను పౌలు తన శ్రమలను గూర్చి అతిశయముతో వ్రాయుటలేదు. బుద్ధిహీనముగా మాట్లాడుచున్నాను అంటున్నాడు. 11 : 1 ఆ ప్రకారము తన బుద్ధిహీనతను సహించవలెనని కోరుచున్నాడని, పౌలు దేనిని గూర్చి అతిశయించుచున్నాడో వాటిని గూర్చి మనలను మనము సరిచూచుకొనుట మంచిది కదా. II కొరి 11 : 23-33; 6 : 4-10.

పౌలు తన జాతినిగూర్చి అతిశయపడుచున్నాడు. వారు హెబ్రీయులా! అయితే నేను మరి యెక్కువగా హెబ్రీయుడ కదా 11 : 22. వారు ఇశ్రాయేలీయులా; అబ్రహాము సంతానమా? అయితే నేను కూడా! పౌలును వ్యతిరేకించువారు శరీరమును బట్టి అతిశయించువారు. పౌలు బుద్ధిహీనునివలె మాట్లాడుచున్నానని అంటున్నాడు 11 : 16-22. పౌలు తన అనుభవములోని బహు కఠినమైన సంఘటన

లను, అపజయములను గూర్చి వ్రాయుచున్నాడు. నేను అతిశయిస్తే నా బలహీనతలయందే అతిశయించుదును అనుచున్నాడు. ఆయన సేవలో బహుగ ప్రయాసపడుచు, నిద్రలేని రాత్రులు, తన శక్తికి మించిన భారములు, పౌలు అనుభవములలో జయములు లేకపోలేదు. మానవుల దృష్టిలో జయకరముగ కనిపించే సేవలు పౌలు అనుభవమును బట్టి చూచినచో అవి జయములు అనిపించుకోనవు.

## బలహీనతలయందే బలము

పౌలుయొక్క శరీరము బలహీనమైన ఘటము, పౌలు మానసికముగాను, శారీరకముగాను పొందిన శ్రమలను తలంచుకొనినచో, ఆయన యేలాగు యింతటి శ్రమలను భరించియున్నాడో మనము ఊహింపలేము. అనేక పర్యాయములు చివరకు మరణమౌతాడు అనే పరిస్థితికి వచ్చియున్నాడు. పౌలుయొక్క శక్తి అంతటికి మించిన శ్రమానుభవమును ఆయన అనుభవించియున్నాడు. ఇట్టి పరిస్థితులలో, బలహీనస్థితిలో ఆయన దేవునియొద్దనుండి శక్తిని పొందియున్నాడు. ఆయన శక్తి ధారపోయబడినపుడు పైనుండి ప్రభువు ఆయనను బలపర్చియున్నాడు. కొరింథీ క్రైస్తవులవలె శ్రమలేని సుఖజీవనమునకు మనము అలవాటుపడి యున్నాము. సువార్త పక్షముగా శ్రమించుటనేమో మనము యెరుగము. దేవునికంటె సుఖానుభవములను యెక్కువగా ప్రేమించుచున్నాము. సంఘముయొక్క క్షేమాభివృద్ధికై నూతనమైన కార్యక్రమములు మనము యేర్పాటు చేసుకొనవచ్చును గాని వాటితో శ్రమజీవనము లేదు. క్రీస్తు కొరకు శ్రమపడుటయేమో మనము యెరుగము, ఆయన కొరకు అలసిపోవుట మనము యెరుగుదుమా? మనము యెప్పుడు బలహీనులమో అప్పుడే బలవంతులము. క్రైస్తవుని జీవితములో బలహీనతల యందు దేవుని శక్తి నింపుదల ప్రత్యక్షమగుచున్నది. ★

—K. జీవానందము, అనకాపల్లి.

## ఇలా చెప్పిన దెవరు?

ఒకడు పాపమునుండి విముక్తి నొంది రక్షింపబడుటకు విశ్వాసము ఒక్కటే చాలునని ఎవరుచెప్పారు? పరిశుద్ధ గ్రంథమందు ఇటువంటి బోధ ఎవరయినను చెప్పి రేమో పరిశీలన చేయుదము.

## పౌలు చెప్పాడా?

విశ్వాసము ఒక్కటే ఒకని రక్షణకు కారణము కాగలదని అపొస్తలుడు పౌలు ఎన్నడును చెప్ప లేదు. ఎప్పుడు, ఎక్కడ చెప్పినట్లు గ్రంథమందు వ్రాయబడి యుంచలేదు.

"క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? ... మనము బాప్తిస్మము వలనే మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి" (రోమా 6 : 3, 4) అని మాత్రమే పౌలు బోధించాడు. గలతీలోనున్న సంఘమునకు వ్రాయుచు "యేసు క్రీస్తునందు మీ రందరు విశ్వాసమువలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" అని స్పష్టముగా చెప్పెను (గలతి 3 : 26, 27).

## పేతురుగాని చెప్పాడా?

లేదు. పేతురు ఎంతమాత్రము విశ్వాసము ఒక్కటే మానవుని రక్షించునని ఎక్కడను ఎప్పుడును చెప్పినట్లు గ్రంథమందు కానరాదు. "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అ. కార్య. 2 : 38) అని తన ప్రారంభ బోధయందే కచ్చితముగా చెప్పాడు.

నోవహు దినములలో జలప్రళయము వచ్చినప్పుడు నోవహు కుటుంబమును దేవుడు ఎట్లు రక్షించెనో.. ...“దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది” (1 పేతురు 3:21).

## యాకోబుకూడ చెప్పలేదు

ఒకడు విశ్వాసముంచి క్రీస్తే దేవుని కుమారుడని నోటితో ఒప్పుకొని రక్షణ పొందుటకు అవసరమయిన క్రియయగు బాప్తిస్మమును పొందకపోయినచో రక్షణ లేదని, దానికి అనుబంధమైన ఉదాహరణలతో చక్కగ అర్థమగు రీతిలో యాకోబు బోధించాడు.

“విశ్వాసము క్రియలు లేనిదైతే అది ఒంటిగా నుండి మృతమైనదగును” (యాకోబు 2 : 17). క్రియలులేని విశ్వాసము మృతము (యాకోబు 2 : 26), “మనుష్యుడు విశ్వాసమూలమున మాత్రము కాక క్రియల మూలమునను నీతిమంతుడని యెంచబడునని, మీరు దీనివలన గ్రహించితిరి” (యాకోబు 2 : 24).

కావున విశ్వాసము క్రియలులేనిదైతే అది నిరుపయోగము. అందుకనే యాకోబు “ప్రాణములేని శరీర మేలాగు మృతమో ఆలాగే క్రియలులేని విశ్వాసమును మృతము” (యాకోబు 2 : 26) అని నిర్వివాదంగా చెప్పాడు.

## ఒకవేళ యేసుక్రీస్తుగాని చెప్పాడా ?

దేవునియందు విశ్వాసము ఉంచుట వలన మాత్రమే మానవులు తమ పాపముల నుండి విమోచింపబడి రక్షింపబడునని ఆయన ఎన్నడును చెప్పలేదు. తాను సిలువ మరణము పొంది లేచుటద్వారా మాత్రమే రక్షింపబడునని కూడ చెప్పలేదు.

అలా కాక "ఒకడు నీటిమూలముగాను ఆత్మమూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 3 : 5) అని మాత్రమే క్రీస్తు బోధించాడు. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" (మార్కు 16 : 16) అని స్పష్టంగా చెప్పాడు. తన శిష్యులను పిలిచి "మీరు వెళ్ళి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామము లోనికి వారికి బాప్తిస్మము ఇయ్యుడి" (మత్తయి 28 : 19) అని మాత్రము ఆజ్ఞాపించాడు. అంతేకాక "నా ఆజ్ఞలను అంగీకరించి వాటిని గైకొనువాడే నన్ను ప్రేమించువాడు (యోహాను 14 : 21) అని కూడ బోధించెను.

వీటన్నిటిని బట్టి పరిశీలించినచో పరిశుద్ధ గ్రంధమందు ఏ ఒక్కరు, మరి ముఖ్యముగా రక్షకుడు యేసుక్రీస్తు విశ్వాసము ఉండిన చాలును రక్షింపబడుదురని చెప్పలేదు.

మరయితే ఎవరు ఈ బోధ చేసారు? మానవుడు మాత్రమే తన సొంత తెలివినిబట్టి అనేక రకముల సిద్ధాంతములను ప్రవేశపెట్టెను.

అసలయిన బోధ అనగా బైబిలు గ్రంధము బోధించుచున్నది ఏమనగా ఒకడు సువార్త విని (రోమా 10 : 17) విశ్వాసముంచి (యోహాను 8 : 24) తన పాపముల విషయమై మారుమనస్సు నొంది (అ. కార్య. 17 : 30) నోటితో ఒప్పుకొని (రోమా 10 : 9, 10) పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను (అ. కార్య. 2 : 38).

ఈలాగుననే పరిశుద్ధాత్ముడు బోధించియున్నాడు. దీనికి విరుద్ధమైన బోధ ఏది లేదు.

—B. సుధాకర్, కాకినాడ.

—o—

# నీవు బీదవాడనని అనుకొనుచున్నావా ?

## ( So you think you are Poor ? )

ఆర్థిక సహాయం కొరకు నన్ను అభ్యర్థించేవారు బహుసా ఉత్తరాల ద్వారాగాని, నోటిద్వారాగాని మేము బీదవారమని వందలాది సార్లు నాకు చెప్పియుంటారు. బీదలకు సువార్త ప్రకటింపబడుట వలన యేసు దేవునిచే పంపబడిన వాడనని ధ్రువించుట కొక కారణమై యున్నది (మత్తయి 11 : 5). క్రీస్తు నామమును మనము ఉచ్చరించునపుడెల్లా, బీదలకు సువార్త ప్రకటింపబడాలని మనం చెప్పుచున్నాము (లూకా 4 : 18).

యేసుయొక్క ఆజ్ఞలను నెరవేర్చు బాధ్యత ప్రతి శిష్యునికి యున్నది (మత్తయి 28 : 18). సువార్త విషయంలో భారతదేశమంత ఫలభరితమైన ప్రదేశము ఇంకొకటి లేదు. కోతకు సిద్ధముగాయున్న పొలమును కన్నులెత్తి చూడుడి యని యేసు చెప్పిన మాట భారతదేశం విషయంలో నూటికి నూరు పాళ్ళు యథార్థమే.

సహోదరులతో మనం సహవాసము కలిగి యుండాలనునది సత్యం (1 యోహాను 1 : 7). అట్టి సహవాసమును మేము కలిగి యున్నాము. అంటే కాలాంతము వరకు భారతదేశ సువార్తికులకు విదేశీ సహాయం అందించాలని దీని యర్థం కాదు. ఈ లోకమే సువార్త పొలము. తూర్పు ఐరోపా దేశములు, రష్యాదేశము కూడ ఇప్పుడు సువార్తకు ద్వారములు తెరుచు చున్నాయి. పాశ్చాత్య దేశ సహోదరులు ఈ తరుణమును చాల చక్కగా సద్వినియోగం చేసికొనుచున్నారు. అంటే భారతదేశ సంఘము తన పనిని తానే మరి యెక్కువగా చేసికొనాలి, గాని మరి యెక్కువగా అమెరికా సహాయము నడుగరాదు.

ఒకానొకప్పుడు అమెరికాలో, ఉత్తర రాష్ట్రాలకు దక్షిణ రాష్ట్రాలకు మధ్య పోరాటం జరుగుతున్నప్పుడు, దక్షిణ రాష్ట్రాల్లో డబ్బు లేక పోయినా, క్రీస్తు సంఘము దక్షిణాదిలో ఎక్కువ అభివృద్ధి జెందినది. ఆ కరువు కాలంలో అమెరికా దక్షిణ రాష్ట్రాల్లో మత్తయి 6 : 33 నిజమైతే, అది యిప్పుడు భారతదేశంలో కూడ నిజం కాగలదు. క్రొత్త నిబంధన కాలంలో బీదలు డబ్బు పుచ్చుకొనుటకు కాదుగాని యిచ్చుటకు బ్రతిమలాడారు (2 కొరింథి 8 : 1-8). లూకా 6 : 38 మరియు మలాకీ 3 : 8-10 యదార్థమే.

మేము దేవుని వాగ్దానాలను నమ్ముకొనుచు పనిని కొనసాగించుకొనుచున్నాము, ఆయన వాగ్దానాలు యదార్థమని చెప్పే ఉత్తరాలు మీ యొద్దనుండి పొందగోరుచున్నాను. యిది జరిగినప్పుడు ముందెన్నడు లేని రీతిగా భారతదేశం అభివృద్ధి జెందుతాది. 1 యోహాను 5 : 4ను చదివి నమ్మండి.

—జె.సి. బెయిలీ, కెనడా.

—o—

## సంక్షిప్త వార్తలు

1992 జనవరి 8వ తేదీనాడు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ డైరక్టర్ నెహెమ్యా గూటంగారు అమెరికా పర్యటనకు వెళ్ళినారు. రెండు మూడు నెలలు అక్కడి సంఘములను దర్శించి కాకినాడకు తిరిగి చేరుకొనగలరు. ఆయన రాకపోకల విషయమై ప్రార్థించ మనవి.

1992 జనవరి 16 నుండి 19 వరకు అనకాపల్లిలో గొప్ప సువార్త సభలు జరిగినవి. అనకాపల్లి, తుమ్మపాల, రాజాం, మునిడివాడ సంఘాలు కలిసి ఈ సభలను అనకాపల్లి గుడ్ షెపర్డ్ ఇంగ్లీషు మీడియం స్కూలు ఆవరణలో దిగ్విజయంగా జరిగించారు. ప్రతి దినం వందలాది

ప్రిజలు సువార్తను వినేవారు. సహో. పి. జాన్‌గారు, పాల్ కూటం గారు, జాషువా కూటంగారు వాక్య పరిచర్య చేసిరి. 18 మంది క్రీస్తు లోనికి బాప్తిస్మం పొందిరి. Good Shepherd English Medium School ప్రిన్సిపాల్, Bro. A. వినయానంద్‌గారు ఈ సభలకు భోజన వసతి సదుపాయాలను మాత్రమే గాక మిగతా అన్ని విషయాల లోను చక్కటి ఏర్పాట్లు చేసి అందరి ప్రశంసల నందుకొన్నారు.

ఆ వంట ఏరియా సువార్తికులు 1991 డిశంబరు 26వ తేదీన కందర వల్లి గ్రామంలో సమావేశమయ్యారు. P. సామ్యూల్‌గారు అధ్యక్షత వహించగా, N. మోజెస్‌గారి ప్రార్థనతో కూటం ప్రారంభమాయెను. సత్యవాక్యమును సరిగా విభజించుట ఎట్లు అను అంశమును పలు సహోదరులు సవిస్తరముగా చర్చించిరి.

జనవరి 22వ తేదీ బుధవారం నాడు కృష్ణాజిల్లాలో దుళ్ళవాని గూడెంలో యున్న క్రీస్తు సంఘ ఆలయ నిర్మాణము కొరకైన పునాది రాయిని సహో. జాషువా కూటంగారు వేయుట జరిగినది. గుడివాడ, దుళ్ళవానిగూడెం ఏరియాలో సహో. D. సుభాకరరావ్ గారు పని చేయుచున్నారు. ఈ కార్యక్రమానికి పెడననుండి K. జోసఫ్, గారు, తిప్పనగుంటనుండి B. రాజారావ్‌గారు, విజయనాడనుండి D. సుభాకరరావ్‌గారు, జేస్తువారపేటనుండి Ch. అబ్రహాముగారు హాజరయ్యారు.

డెల్టాప్రాంతపు సువార్తికుల సమావేశము జనవరి 21వ తేదీన పాల గుమ్మిలో ప్రారంభమయ్యెను. 1991వ సంవత్సరంలో అనేక ప్రదే శాలలో దేవుని సంకల్పమును ప్రకటించుటకును, స్థానిక సంఘాలకు క్షేమాభివృద్ధి కలుగజేసే సందేశాలను అందించుటకును, క్రీస్తు కొరకు ఆత్మలను జయించుటకును, నూతనంగా నిర్మింపబడిన ఆరాధనా స్థలా

లలో ప్రవేశించుటకును సోదరులను హెచ్చరించుటలోను, బలపర్చుటలోను వారికి చేయూత నందించుటలోను తోడుగానున్న దేవునికి మా కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము. "మా ద్వారా ప్రతి స్థలమందును క్రీస్తును గూర్చిన జ్ఞానముయొక్క సువాసనను కనపరచుచు ఆయన యందు మమ్మును ఎల్లప్పుడు విజయోత్సవముతో ఊరేగించుచున్న దేవునికి స్తోత్రము" (2 కొరింథీ 2 : 14).

జనవరి 21న పాలగుమ్మి గ్రామములో జరిగిన సమావేశములో "దేవత్వములో ఒక్కరా లేక ముగ్గురా?" అను ముఖ్యమైన అంశము చర్చించబడెను. ఈ చర్చలో సోదరులు జాషువా గూటంగారు, N. వలియాగారు, S. రామకృష్ణారావుగారు మరియు ఇ. కె.వి. ప్రసాదరావుగారు పాల్గొనిరి. తండ్రియే కుమారునిగా అవతరించెననునది ముగ్గురూ ఒకే వ్యక్తి యనునది అబద్ధ సిద్ధాంతమని వివరించిరి. పాల్ గూటంగారు మరియు ఇ. కె.వి. ప్రసాదరావుగారు యెహోవా పంపినవాడని యేసుక్రీస్తు పంపబడినవాడని పరిశుద్ధాత్మ ఆదరణకర్త యని వేరు వేరు వ్యక్తిత్వములు (personalities) లేఖనాలనుండి చూపి వారేకమై యున్నారని తెలియజేసిరి. సుమారు 70 మంది సువార్తికులు సమావేశానికి హాజరైరి.

6 గురు క్రీస్తులోనికి పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన అనంతరము పాలగుమ్మి గ్రామమంతయు ప్రతిధ్వనించే సువార్త దండయాత్ర పాటలతో, వాక్యోపదేశాలతో జరిగెను. "ఆరాధనామూర్తి" అను చిన్న పుస్తకములు ఇంటింటికీ పంచిపెట్టబడెను. అనేకులు సువార్తను వినిరి.

రాత్రి కూటమునకు అధిక సంఖ్యలో హాజరై దేవుని వాక్యమును వినిరి. వి. చిన్నయ్యగారు సభకు అధ్యక్షత వహించగా బ్రదర్ జాషువా గూటంగారు గొప్ప సందేశమును అందించిరి. కొలస్స 1:18 ఆధారంగా క్రీస్తు ప్రాముఖ్యమును ఆయన జననము, వ్యక్తిత్వము ఆయన నామము, ఆయన జీవితము, ఆయన బోధలు మరియు ఆయన అధికారముయొక్క ప్రాముఖ్యమును వివరించి మనము ఎట్లు అన్నిటిలో ఆయనకు ప్రాముఖ్యమీయవలెనో తెలియజేసిరి.

పాలగుమ్మి, నడిపూడి బండార్లంక గ్రామాలలో సోదరులు దేవర పల్లి అబ్రహాముగారు గొప్ప పనిని జరిగించుచున్నారు. కూటము నిమిత్తము స్థానిక సంఘము విస్తృతమైన ఏర్పాట్లు జరిగించెను. కూటము అనంతరము అందరూ సంతోషముతో తమ గ్రామాలకు తిరిగి వెళ్ళిరి.

* * *

జనవరి 30వ తేదీ గురువారంనాడు పశ్చిమ గోదావరి జిల్లా కొమ్మర గ్రామంలో చక్కటి సువార్త కూటము జరిగెను. కాకినాడ నుండి జాషువా గూటంగారు వారి సతీమణి, జోని సుధాకర్ గారు వారి సతీమణి హాజరైరి. జాషువాగారు, సుధాకర్ గారు చక్కటి వాక్యోపదేశం చేయగా 17 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. కొమ్మర, కోమటిపాలెం గ్రామాలలో సహో. Y. ప్రభుదాస్ గారు క్రీస్తు కొరకు చక్కటి పనిని జరిగించు చున్నారు.

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
SATYAWAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To